రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## ఘనంగా శ్రీలక్ష్మీనర్సింహ స్వామి కళ్యాణ మహోత్సవం


కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడ్చల్, మే 19. ప్రభాతవార్త :** లోక కళ్యాణం కోసం మేడ్చల్‌లో శ్రీలక్ష్మినర్సింహ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించిన ఈ ఉత్సవాన్ని వేద పండితులు సాంప్రదాయ పద్ధతిలో కనుల పండుగగా జరిపారు. భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని ఉత్సవాన్ని తిలకించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు ప్రతాప్‌రెడ్డి, కార్యక్రమ నిర్వహకుడు విష్ణు, నాయకులు శేఖర్ గౌడ్, భాస్కర్ యాదవ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి బోనం సమర్పించిన ఎమ్మెల్యే కుటుంబసభ్యులు


ఆలయంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల పూజలు

**కడ్తాల్, మే 19 ప్రభాతవార్త :** కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలోని మైసమ్మ దేవాలయాన్ని ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కుటుంబ సభ్యులు అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి, నాగర్‌క ర్నూల్ జడ్పీ వైస్ ఛైర్మన్ బాలాజీసింగ్ అమ్మవారిని దర్శించుకుని పూజలు గావించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు, ప్రజా ప్రతినిధులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలు నిర్వహించి శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## బిసి రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక ఎన్నికలు నిర్వహించొద్దు

### -బిసి యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షుడు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బిసి రిజర్వేషన్లు పెంచిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిసి యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. తాండూరు పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో సమగ్ర కులగణన చేపడుతామని చెప్పి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అసెంబ్లీలో కులగణపై ఏకగ్రీవ తీర్మానం చేశారు.జీవో 26ను విడుదల చేయడంతో పాటు 150 కోట్ల బడ్జెట్‌ను కూడా విడుదల చేశారని గుర్తు చేశారు.పార్లమెంట్ ఎన్నికల వలన బ్రేక్ పడింది.కావున ఎన్నికలు ముగిసినందున జీవో 26 ప్రకారం బిసి కులగణన ప్రక్రియను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.కులగణన చేయకుండా బిసి రిజర్వేషన్లు పెంచకుండా సర్పంచ్,ఎంపిటిసి ,జడ్పిటిసి ,మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహిస్తే బిసిలు రాజకీయంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు.గతంలో జరిగిని అసెంబ్లీ ,పార్లమెంట్ ఎన్నికల్లో బిసిలు ఆర్థికంగా లేరనే నేపంతో టికెట్లు ఇవ్వలేదని కనీసం స్థానిక సంస్థల ఎన్నికల్లో అయిన బిసిలు పోటీ చేసే అవకాశం రావాలంటే జనాభా దామాషా ప్రకారం బిసిలకు రిజర్వేషన్లు పెంచిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని అన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినమైన చర్యలు : ఎస్పీ

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** జిల్లాలో నకిలీ,కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...వానాకాలం సాగు ప్రారంభమవుతున్న సమయాన్ని దృష్టిలో ఉంచుకొని కొందరు నేరగాళ్ల తమ స్వలాభం కోసం అమాయక రైతులను నష్టం కలిగించే విధంగా నకిలీ విత్తనాలు ,కాలం చెల్లిన విత్తనాలు అమ్ముతారు.ఈ విషయంపైన జిల్లాలోని రైతులు అవగాహన పెంచుకోవాలని ,ఎవరైనా నకిలీ,కాలం చెల్లి ప్రభుత్వ నిషేధిత మందులు, విత్తనాలు అమ్మితే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడం జరిగుతుందని జిల్లా పరిధిలోనకిలీ విత్తనాలను విక్రయిసునత్నట్లుగా సమాచారం అందింతే తక్షణమేపోలీసులకు సమాచారం అందించాలని లేదా జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికా రులకు గానిడైల్ 100కు గాని సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని నకిలీ,కాలం చెల్లిన విత్తనాల కేసులు నమోదు అయిన వారిపైన పిడియాక్ట్‌లు పెట్టడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

## ఎన్నికల సంఘం అనుమతితో బదిలీలు,పదోన్నతులు నిర్వహించాలి

### ఎస్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్

**కొడంగల్,మే 19ప్రభాతవార్త** ఉపాధ్యాయుల పదోన్నతులకు న్యాయపరమైన అటంకాలు తొలగిపోయినందున పదోన్నతులు, బదిలీలకు ఎన్నికల కమీషన్ అనుమతి తీసుకొని వీలైనంత త్వరగా షెడ్యూలును విడుదల చేసి పాఠశాలల ప్రారంభం నాటికి పూర్తి చేయాలని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ కాచిగూడలో నిర్వహించిన ఎస్టీయూ ద్వితీయ కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.2010 ఆగష్టు 23కు పూర్వం నియామకమైన ఉపాధ్యాయులకు టెట్‌తో నిమిత్తం లేకుండా పదోన్నతులు ఇవ్వాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినందున ,ప్రధానోపాధ్యాయులకు,పాఠశాల స్థాయి మారిన సందర్భంలో మాత్రమే టెట్ అవసరమని ఎన్‌సీటీఈ వివరణ ఉత్తర్వులు ఇచ్చినందు వల్ల పదోన్నతులకు గల అటంకాలన్నీ తొలగిపోయాయని గుర్తు చేశారు.వివిధ కారణాలతో నిలిచిపోయిన ప్రక్రియను ప్రారంబించాలని కోరారు.మోడల స్కూల్,ఆశ్రమ, గురు కుల పాఠశాలల్లో బదిలీలు,పదోన్నతుల ప్రక్రియను ప్రారం బించాలని,పర్యవేక్షణాదికారుల పదవుల భర్తీపై న్యాయ సలహ లు తీసుకొని ప్రత్యాహ్నమయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఆలో చనలో ప్రభుత్వం ఉన్నట్లు వెల్లడించారు.సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని,అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏ, ఏరియర్స్‌తో పాటు అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే ఖాతాల్లో జమచేయాలని కోరారు.సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.షఫీ పాల్గొన్నారు.

## ఈనెల 23న గిరిజన గురుకుల కళాశాలలో ప్రవేశానికి కౌన్సెలింగ్

**కొడంగల్,మే 19ప్రభాతవార్త** తెలంగాణా రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో కొడంగల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరానికి ఎంపీసీ,బైపీసీ గ్రూపులకు మిగిలిన సీట్లకు ప్రవేశానికిగాను 10వ తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులకు ఈనెల 23న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు.2023-24 సంవత్సరం పదవ తరగతి పాసైన గిరిజన విద్యార్థులకు అడ్మిషన్లు ఈనెల 23న ఉదయం 10:30 గంటలకు హైద్రాబాద్‌లోని ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో స్పాట్ కౌన్సెలింగ్ హాజరుకావాల్సి ఉంటుందని ప్రాంతీయ సమన్వయ అధికారిణి పీఎస్.కళ్యాణి తెలుపడం జరిగిందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 23న ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో సంభందిత సర్టిఫికెట్‌లతో స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరై ప్రవేశం పొందాలని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

## సుందరయ్య జీవితం నేటితరానికి ఆదర్శం



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పిస్తున్న ఇబ్రహీంపట్నం సిపియం నాయకులు

**ఇబ్రహీంపట్నం, మే 19, ప్రభాతవార్త:** కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్యకు సిపిఎం నాయకులు నివాళులర్పించారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలోని పార్టీ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలి నిర్వహించి పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా సిపియం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపియం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బి.సామేల్ మాట్లాడుతూ.. సుందరయ్య పేదల అభ్యున్నతి కోసం చేసిన కృషిని గుర్తు చేసారు. సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని అన్నారు. తనకు పిల్లలు పుడితే సమాజ సేవ చేయడానికి అటంకం కలుగుతుందేమోనని పల్లలను కనకుండ ఉన్న త్యాగమూర్తులు సుందరయ్య దంపతులు అని కొనియాడారు. కార్యక్రమంలో సిపియం మండల కార్యదర్శి సిహెచ్ జంగయ్య, మున్సిపాలిటీ కార్యదర్శి సిహెచ్.ఎల్లేష, నాయకులు గణేష్, నర్సింహ్మా, జగన్, బుగ్గరాములు, లింగస్వామి, వెంకటేష్, ముసిలయ్య, ఆనంద్ తదితరులున్నారు.

## కాలుష్యపు నీటితో చేపలు మృత్యువాత

### వ్యర్థాలను నివారించాలంటూ మత్స్యకారుల ఆందోళన


ఎదులాబాద్ లక్ష్మినారాయణ చెరువులో చనిపోయిన చేపలు

**ఘట్‌కేసర్, మే 19, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ లక్ష్మినారాయణచెరువులో కాలుష్యపు నీటితో చేపలు చనిపోయాయి. ఎరుమల్లె వాగు, నారాయణరావుచానల్ కాలువల ద్వారా చెరువులోకి మురికి వ్యర్థ జలాలు వచ్చి చేరుతున్నా యి. ఒక్కసారిగా చేపలు మృత్యువాత పడటంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. చనిపోయిన చేపలు పెద్దఎత్తున ఒడ్డుకు కొట్టుకురావడంతో వారు చూసి ఆవేదన వ్యక్తం చేశారు. జవహార్‌నగర్ డంపింగ్‌యార్డు నుంచి వెలువడుతున్న వ్యర్థ రసాయన జలాలు ఎరుమల్లెవాగు ద్వారా లక్ష్మినారాయణ చెరువులో కలుస్తుండటంతో నీరు కలుషితమై చేపలు చనిపోతున్నాయని వారు పేర్కొన్నారు. వర్షాలకు డంపింగ్‌యార్డ్ ప్రమాదకరమైన కలుషిత జలాలు వాగులోకి వచ్చి చెరువులో కలిసి చేపలు మృత్యువాత పడ్డాయని వారు వాపోయారు. చెరువుపై ఆధారపడి 700 మత్స్యకారుల కుటుంబాలు చేపల వేట ద్వారా జీవనోపాధి పొందుతున్నాయని ప్రతి యేటా కాలుష్యపు నీటితో చేపలు చనిపోయి తమకు లక్షల రుపాయల నష్టం వాటిల్లుతుందని అధికారులు జవహర్‌నగర్ డంపింగ్‌యార్డ్ వ్యర్థ జలాలు వాగు లోకి రాకుండా తగిన నివారణ, మురికినీటి శుద్ధీకరణ చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. ఒక వైపు మూసీ మురికి నీటితో నారాయణరావు చానల్‌కాలువ, మరో వైపు జవహార్‌నగర్ డంపింగ్‌యార్డు వ్యర్థ జలాలతో ఎరుమల్లెవాగులు పూర్తిగా కలుషితమై చెరువును మురికికూపంగా మారస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

## ఘట్‌కేసర్ ఆర్‌ఓబి పనులు వేగవంతం చేయాలి

### పెండింగ్ బిల్లు చెల్లించేలా ఆర్థికమంత్రికి విన్నవించాలి


టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్‌కు వినతిపత్ర ం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్ తదితరులు

**ఘట్‌కేసర్, మే 19, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పట్టణంలో నిర్మిస్తున్న రైల్వేవంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు వజ్రేశ్‌యాదవ్‌ను కలిశారు. వంతెన పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లు చెల్లించేలా రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్లాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆర్‌ఓబి పనుల కారణంగా రోడ్డుపై వాహనాల రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారని, బస్సులు పట్టణంలోకి రాకుండా పోతున్నాయని స్థానికులు అసౌకర్యానికి లోనవుతున్నారని తెలిపారు. వంతెన నిర్మాణంలో భాగంగా స్థలాలు, ఇండ్లు కోల్పోయిన బాధితులను జూన్ 4 తర్వాత పిలిపించి వారి డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించే దిశగా చొరవ తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ, కౌన్సిలర్లు కదుపోల్ల మల్లేశ్, కుతాడి రవీందర్, ఆర్‌బిఎ స్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, డీసీసీ కార్యదర్శి ఉల్లి అంజనేయు లు, మాజీ వార్డుసభ్యులు మామిండ్ల చితా_రియాదవ్, బర్ల దేవేందర్, విబి.వెంక టనారాయణ, సల్లూరి నర్సింగ్‌రావు, మేడ్చల్ యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కొమ్మిడి శివప్రదీప్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, నాయకు లు కేశవపట్నం అంజనేయులు, పి.శశిధరణ్, ఫారూఖ్, రఫీయుద్దిన్, సిరాజు ద్దిన్, ఎం.అబ్దుల్‌ఖయ్యూమ్, సార శ్రీనివాస్‌గౌడ్, శివరాత్రి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వ నిర్లక్ష్యం: ఎంపిపి


ధాన్యం కొనుగోలు కేం ద్రానికి తూకం కంటాలను అందజేస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్

**ఘట్‌కేసర్, మే 19, ప్రభాతవార్త:** రైతులు పండించిన వరిధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రానికి వైఎస్ రెడి ట్రస్ట్ ఆధ్వర్యంలో 2 తుకం కంటాలను అందజేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఎంపిపి సుదర్శన్‌రెడ్డితో పాటు ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి సందర్శించి రైతులతో మాట్లాడారు. వడ్ల కొనుగోలుకు కంటాలు, సంచులు, లిఫ్టింగ్ కోస ం కార్మికుల కొరత ఉందని రైతులు వారి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎంపిపి తన వైఎస్ రెడ్డి ట్రస్ట్ ద్వారా 2 తూకం కంటాలను కొనుగోలు చేసి రైతుల సమస్యను తీర్చేందుకు అందించారు. గతంలో 4 కంటాలను ఎంపిపి అందించగా ఈసారి మరో రెండు ఇచ్చినందుకు ఆయనకు రైతులు ధన్యవాదాలు చెప్పారు. కేంద్ర ప్రభు త్వం రైతుల పంట కొనుగోలు విషయంలో మద్దతుధర, కూలీల చార్జిలు, సంచుల సరఫరా దగ్గర నుంచి ఆకరికి సూది డబ్బదం వరకు అన్ని సమకూ ర్చుతున్నా ప్రైవేటు దళారులకు లబ్ది చేకూర్చేందుకు ప్రభుత్వ యంత్రాంగం చేస్తున్న జాప్యంతో రైతుల శ్రమ అంతా వర్షార్పణం అయ్యే ఆస్కారముందని ఎంపిపి అన్నారు.

## రాజ్యాంగంతోనే రిజర్వేషన్లు, పదవులు:రూప్‌సింగ్


అంబేద్కర్‌కు నివాళులు అర్పించి రాజ్యాంగపీఠికపై ప్రతిజ్ఞ చేస్తున్న మాజీ సర్పంచ్ రూప్‌సింగ్‌నాయక్

**ఘట్‌కేసర్, మే 19, ప్రభాతవార్త:** అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగంతోనే ఎస్‌టీ, ఎస్‌సీ, బీసీలకు రిజర్వేషన్ల ద్వారా పదవులు సిద్దిస్తున్నాయని ఘణాపూర్ మాజీ సర్పంచ్ నానావత్ రూప్‌సింగ్‌నాయక్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషన్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 162వ వారం నిత్య పూలమాళ కార్యక్రమం నిర్వహించారు. పీబీఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త ఎం.అరున్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఘణాపూర్ మాజీ సర్పంచ్ రూప్‌సింగ్‌నాయక్ విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళవేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా రాజ్యాంగపీఠికపై అందరూ ప్రమాణం చేసి పుస్తకాలను ప్రదర్శించారు. అంబేద్కర్ ఆశయసాధనకు అందరూ ముందుకు రావాలని రూప్‌సింగ్ పిలుపునిచ్చారు. సమాజంలో అంటరానితనం నిర్మూలనను నివారించాలని దళిత, గిరిజనులపై దాడులను అరికట్టాలని ఆయన కోరారు. 1936 మే 15న అంబేద్కర్ జాత్‌తొడక్ మండల్ ప్రసంగం కోసం కుల నిర్మూలన (అహ్నిలేషన్ ఆఫ్ క్యాస్ట్)ను రచించారని కుల నిర్మూలన రచించి 88 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా కుల నిర్మూలన పుస్తకం కోసం భరత్‌కుమార్ తెలియజేశారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మేకల దాసు, ప్రధానకార్యదర్శి ఇరిటం శ్రీనివాస్, నాయకులు బండారు రాందాస్, గుర్జకుంట నర్సింహ్మా, నానావత్ శివాజీనాయక్, సచిన్, వెంకటేశ్వరరావు, మహిపాల్, జగదీష్, ఆనంద్, కళ్యాణ్ శ్రీనివాస్, కృష్ణంరాజు, విష్ణు, భరత్‌కుమార్, సచిన్, సాయిచరణ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.


శామీర్‌పేట కట్టమైసమ్మకు బోనాలు సమర్పించడానికి ఊరేగింపుగా వస్తున్న మహిళలు

## శామీర్‌పేట కట్టమైసమ్మకు బోనం

**శామీర్‌పేట, మే 19, ప్రభాతవార్త** శామీర్‌పేట పెద్ద చెరువు కట్ట మైసమ్మ అమ్మవారి ఆలయం వద్ద అలియాబాద్ గ్రామానికి చెందిన పలువురు బోనాలు (పండుగ) చేసి కట్టమైసమ్మ అమ్మవారికి సమర్పించారు. ఆదివారం శామీర్‌పేట పెద్ద చెరువు కట్ట మైసమ్మ ఆలయం వద్ద అలియాబాద్ గ్రామానికి చెందిన పలువురు బోనాలు చేసి ప్రత్యేక పూజలు జరిపి అమ్మవారికి ఆ బోనాలను ఊరేగింపుగ మహిళలు, పలువురు తీసుకవెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చి సమర్పించారు. శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ గ్రామానికి చెందిన పెద్ద చెరువు కట్ట వద్ద పలువురు బోనాల పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగ కట్టమైసమ్మ అమ్మవారిని పలువురు నాయకులు, భక్తులు పాల్గొని దర్శించుకున్నారు.

### నేడు పెద్దచెరువు కట్టమైసమ్మ పండుగ

అలియాబాద్ గ్రామం తరపున శామీర్‌పేట పెద్ద చెరువుకట్ట మైసమ్మ పండుగను సోమవారం ఆ గ్రామస్థులు నిర్వహిస్తున్నారు. శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ గ్రామం తరపున గ్రామ పెద్దలు అందరు కట్టమైసమ్మ పండుగను ప్రతి ఏటా నిర్వహించటం జరుగుతూ వస్తుంది. గత వారం శామీర్‌పేట గ్రామం తరపున కట్టమైసమ్మ పండుగను జరుపుకున్న సంగతి తెలిసిందే. ఈ సోమవారం అలియాబాద్ గ్రామం వారు కట్టమైసమ్మ పండుగను జరుపుకుంటున్నారు. అమ్మవారికి బోనాలు,ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## పేద వికలాంగులకు ఉచితంగా వీల్ చైర్స్ పంపిణీ


వికలాంగులకు ఉచితంగా వీల్ చైర్స్‌ను అందజేసిన మణిగండ్ల కిష్టయ్య,శ్రీనివాస్, న్యాయవాది శ్రీకర్‌శర్మ

**శామీర్‌పేట, మే 19, ప్రభాతవార్త** జగ్గంగూడ,సంపన్‌బోల్ గ్రామాల్లో పేద వికలాంగులకు వీల్‌చైర్స్‌ను దాతలు పంపిణీ చేశారు. ఆదివారం మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడ-సంపన్‌బోల్‌లో పేద వికలాంగులకు మనోధైర్యం కల్పించటానికి కాళ్లు ఉన్నా నడవలేని వారికి ఉచితంగ వీల్ చైర్స్‌ను పంపిణీ చేశారు. ప్రొఫెసర్ కొల్లూరి హరిగోపాల్-భారతిదేవిల వివాహరోజును పురస్కరించుకుని గొప్ప మనస్సుతో వారు పేద వికలాంగులకు వీల్‌చైర్స్‌ను అందించటం సంతోషంగ ఉందన్నారు. మణిగండ్ల కిష్టయ్య వారి కుమారులు మణిగండ్ల శ్రీనివాస్ వారి ఆధ్వర్యంలో పేద వికలాంగులకు వీల్‌చైర్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. సన్స్ ట్రస్ట్ అధినేత, న్యాయవాది నూతి శ్రీకర్ శర్మ మాట్లాడుతూ ఎంత మంది వికలాంగులు ఉన్నా అందరిని ఆదుకుంటామని అన్నారు. అవసరం ఉన్న వికలాంగులకు అందించటానికి కృషి చేస్తామన్నారు. సేవా కార్యక్రమం చేయటం సంతోషకరమన్నారు. మణిగండ్ల కిష్టయ్య మాట్లాడుతూ సేవా కార్యక్రమంలో భాగంగ జగ్గంగూడ గ్రామానికి చెందిన శంకర్‌రావు, బొమ్మనపల్లి నాగమణిలకు వీల్‌చైర్స్‌ను అందజేశారు. వీల్‌చైర్స్‌ను అందజేసిన వారికి వారు దన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు

**శామీర్‌పేట, మే 19, ప్రభాతవార్త** కేశవరం శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సామూహిక శ్రీసత్యనారాయణ వ్రతాలు జరిగాయి. మూడుచింతలపల్లి మండలంలోని కేశవరంలో శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగ ఆదివారం ఆలయ ప్రాంగణంలో సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రత మహోత్సవ కార్యక్రమాలు జరిగాయి. పలువురు దంపతులు శ్రీసత్యనారాయణస్వామి వ్రతంలో కూర్చున్నారు. ఈ సందర్భంగ పలువురు దంపతులు, భక్తులు పాల్గొని శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీసత్యనారాయణస్వామి వ్రతమహోత్సవం పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినానికి ఉద్యమ గేయాలు

**ఘట్‌కేసర్, మే 19, ప్రభాతవార్త:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యమ కారుల త్యాగాలను కొనియాడుతూ ఉద్యమ గేయాలను చిత్రీకరిస్తున్నారు. ఘట్‌కేసర్ పరిసర ప్రాంతాల్లో నేర్నాల క్రియేషన్స్ ఆధ్వర్యంలో తెలంగాణ పాటకు ప్రాణం పోసిన ఉద్యమ కారుడు నేర్నాల కిషోర్ సారథ్యంలో పలు సన్నివేశాల పాటలను చిత్రీకరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ గేయాలు, కళాకారుల పోరాటంతోనే అంతిమ విజయం తెలంగాణాకు, నాటి పోరాటంలో అమరుల త్యాగఫలమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు శీర్షికలతో పాటను రూపొందిస్తున్నారు. తెలంగాణ కోసం అమరుడైన సిరిపురం యాదన్న పాత్రను ఘట్‌కేసర్‌కు చెందిన వరికుప్పల రాకేశ్ పోషిస్తుండగా అమరుడైన కానిస్టేబుల్ కిష్టయ్య, చిన్నపిల్లల సనివేశాలను ప్రజలు ఆకట్టుకునే విధంగా ఉంటుందని కిషోర్ అన్నారు. ఈపాటలో గద్దర్ వేషధారణతో ఏడిఎంఎస్ శివాజీ, కొరియోగ్రఫీ డిఓపి శాంతిరాజ్, కళాకారులు కోడి వెంకట్, నమిండ్ల రాజేశ్వర్‌రావు, కె.శ్రీనివా స్‌రెడ్డి, ఒ.శ్రీను, కె.సత్యం, ఆర్.సైదులు వివిధ పాత్రలను పోషించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం నిరాహార దీక్షలు, నిరసనలు, ధర్నాలు ఉద్యమ స్ఫూర్తి కళాకారుల ధూమధాం లాంటి కార్యక్రమాలలో కండ్లకు కట్టినట్లు నటిస్తున్నారని తెలిపారు.


గద్దర్ వేషధారణలో ఉన్న శివాజీతో ఉద్యమ కళాకారుడు కిషోర్

# బాబోయ్...ఇవేం రోడ్లు..!



-ప్రధాన రహదారులపైనా భారీ గుంతలు
- పూర్తిగా పాడైపోయిన గోల్నాక- ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారి
-అంతర్గత రోడ్లు మరీ అధ్వాన్నం
-రాత్రిపూట ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్ర వాహనదారులు



హైదరాబాద్, మే 17, ప్రభాతవార్త

భారీ వర్షాలకు మహానగర రహదారులు ఎప్పటి లాగే ఛిద్రమయ్యాయి. వందల కోట్లు ఖర్చు పెట్టినా పరిస్థితిలో మార్పు కాలేదు.నగరంలో రోడ్లన్నీ గుంతలు, కంకరతో నిండి స్థానికులు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధ్వానమైన రోడ్లపై ప్రయాణిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. దీనికి తోడు పైపులైన్లు, కేబుళ్ల కోసం తవ్విన రోడ్లను సకాలంలో పునరుద్ధరించకపోవడంతో చాలాచోట్ల దారులు అస్తవ్యస్తంగా మారాయి. ఎక్కడపడితే అక్కడ గుంతలు పడినా పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిరుజల్లులు కురిస్తే నగరం చెరువును తలపిస్తుంది.. అలాంటిది భారీ వర్షం పడిందంటే ఇక సముద్రాన్ని తలపించేలా ఉంటోంది.గ్రేటర్‌లో 9,103 కి.మీల రహదారులున్నాయి.ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలా రోడ్లు గుంతల మయంగా మారడంతో పాటు వరద నీటితో కొట్టుకు వచ్చిన మట్టి మేట వేసింది. ఒక వైపు గుంతలు, మరో వైపు మట్టి, కంకర ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చిన్నపాటి వర్షం పడితే ఆ గోతుల్లో నీరు చేరి చెరువు నిండుతుంది. దీన్ని గుర్తించని డ్రైవర్లు చిన్న చిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డులో ప్రయాణించడం సాహసమేనని అంటున్నారు. కాగా, నగరంలో రోడ్లు మరింత నరకంగా మారుతున్నాయి. రోడ్లపై గుంతలు తవ్వడంతో వాహనదారులు, పాదాచారులకు తిప్పలు తప్పడం లేదు. లెక్కలేనన్ని గోతులపై గతిలేక ప్రయాణం సాగిస్తున్న వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నాయి. గోతులు పూడ్చేందుకు వచ్చిన జీహెచ్ఎంసీ, శివారు మున్సిపాలిటీ సిబ్బంది.. దెబ్బతిన్న రోడ్లపై ప్యాచ్‌వర్కుతోనే సరిపెడుతున్నారు. దీంతో భారీ వర్షం పడగానే రోడ్ల న్నీ గుంతలుగా మారుతున్నాయి. వాహనదారులు మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయ సమీ పంలో రోడ్డు తెగిపోయింది. రోడ్డు రెండుగా చీలి పోవడంతో రాకపోకలు స్థంభించాయి. రోడ్డు తెగి పోయి రెండుగా చీలిపోయిన ప్రమాద సూచికలు కనిపించడంలేదు. ఇక్కడ రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం వుందని, ప్రాణనష్టం జరగకముందే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నా రు.ఎలివేటెడ్ కారిడార్ పనులు జరుగుతున్న ఉప్ప ల్-నారపల్లి, గోల్నాక- అంబర్‌పేట చేనెంబర్ మీదుగా వరంగల్ జాతీయ రహదారి పూర్తిగా రోడ్డు పాడైపోయింది. ఇక అంబర్‌పేట ఆలీకేఫ్-జలమం డలి క్రికెట్ గ్రౌండ్-ఉప్పల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం, కెసిఆర్ నగర్- నాగోల్ మెట్రో రోడ్డు మార్గంలో, అలాగే ఉప్పల్ ఆర్టీసి బస్సు స్టాండ్ అధ్వాన్నంగా తయారైంది. నాణ్యతారహిత పనుల వల్లే ఈ పరిస్థితి అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రోడ్లు గుంతలు పడ్డ ఎవరూ పట్టించుకోరని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా బాధ ఎవరికి చెప్పుకోలేక పోతున్నామని అన్నారు. లీడర్లు పాలకులు వాళ్ల తీరు మారదని మండిపడ్డారు. కేవలం ఓట్లు కావాలని వస్తారు.. సమస్యలు పరిష్కరించమంటే కనిపించరంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు అలాగే తయారయ్యారని వాపోయారు. వర్షం పడితే రోడ్లు మాకు నరకం చూపిస్తున్నాయని అన్నారు. రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యా యని తెలిపారు. దీనికి తోడు రోడ్లు తవ్వి ఎక్కడికక్కడ వదిలేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రోగాలు వస్తున్నాయని, వర్షం పడగానే చెరువుల్లా అయితాయి రోడ్లు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ వాటర్ గుంతలు ఎక్కడ ఎప్పుడు రోడ్లపై ఏమవుతుందో అర్థం కాదన్నారు. గోతులమయంతో మేము ఇబ్బందులు పడుతున్నామంటూ వాపోయాడు. జీహెచ్ఎంసి రోడ్లపై కానీ ప్యాచ్‌వర్క్ కూడా వేయడం లేదని తెలిపారు.

ఐదు నెలల క్రితం నిర్మించిన రహదారులపై కూడా పలు ప్రాంతాల్లో గుంతలు పడి, కంకర తేలాయి. ఇక శివారు ప్రాంత ఫిర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లలో కంకరతేలి మోకాల్లోతున గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గ్రేటర్ పరిధిలోని వారాసిగూడ, సీతాఫల్‌మండి, చిలకలగూడ, రాంనగర్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో ఏర్పడిన గుంతలను పూర్చడం లేదని పలువురు పేర్కొంటున్నారు. దీంతో ఆయా ప్రాంతాలల్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.నగర శివారు ప్రాంతాలు నిజాంపేట, దుండిగల్, మణికొండ మున్సిపాలిటీల ప్రాంత రహదారుల్లో పరిస్థితి మరీ ఆధ్వాన్నంగా మారింది. తాగునీటి, డ్రైనేజీ పైపులైన్ల కోసం తవ్విన రోడ్లను పునరుద్ధరించలేదు. రాంనగర్-అచ్చయ్యనగర్-పద్మాకాలనీ నాలా పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. కాగా, వర్షాలు వస్తున్నాయంటే నీరు నిలిచి రోడ్లు పాడవుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

ఇందులో కొంత వాస్తవం ఉన్నా..శాస్త్రీయ విధానంలో రోడు నిర్మించకపోవడమే వరద నీరు నిలిచేందుకు ప్రధాన కారణమని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ ప్రమాణాల ప్రకారం రోడ్డు మధ్యలో ఎత్తుగా ఉండి, పక్కలకు ఏటవాలుగా ఉండాలి. కానీ కార్పెటింగ్, రీ కార్పెటింగ్ ప్యాచ్ వర్క్‌ల పేరిట ఇష్టానికి బీటీ మిక్సింగ్ వేయడంతో చాలా ప్రాంతాల్లో ఎగుడు దిగుడుగా రమదారులు కనిపిస్తాయి. దీంతో స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు ఉన్న వాటిలోకి వర్షపు నీరు వెళ్లే పరిస్థితి చాలా ప్రాంతాల్లో లేదు. రోడ్ ప్రొఫైల్ సరిగా లేకపోవడమూ రోడ్డు పాడవడానికి కారణమన్నది నిపుణుల అభిప్రాయం.

## వీరతెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య

చిక్కడపల్లి, మే 19 ప్రభాతవార్త:

నిజామ్ రాచరిక పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన వీర తెలంగాణ రైతాంగ పరిపాల నకు వ్యతిరేకంగా భూస్వాముల దాష్టీకాలకు వ్యతిరేకంగా జరిగిన వీరతెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఆర్.వివేక్, బి.వెంకటస్వామిగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందర య్య పార్కులో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ సందర్భంగా ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ప్రసంగించారు. పేదలనే తన పిల్లలుగా భావించి కించిత్తు స్వార్థం లేకుండా నిస్వార్థంగా నిరాడంబరంగా తుది శ్వాసవరకు ప్రజాసంక్షేమం కోసం పాటుపడిన యోధుడన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు వి.నాగభూషణం, పార్కు సభ్యులు రమేశ్‌రెడ్డి, కిషన్ రావు, సాగర్‌రెడ్డి, రవికుమార్, రాఘవరెడ్డి, కందుకూరి నర్సింహా, మనోహర్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి, నారాయణ, అంజయ్య, నారాయణగౌడ్, తీగల సాగర్, టి.స్కైలాబ్ బాబు, కోటరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్‌లు అమలు చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలి

**చిక్కడపల్లి, మే 19 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కేటాయించాలని జాతీయ ఎంబిసి కన్వీనర్ కొండూరు సత్యనారాయణ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీనినిలబెట్టుకోవాలన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం వద్ద విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కులగణన చేపడ్తామని చెప్పి అసెంబ్లీలో తీర్మాణం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేయక పోనూ వచ్చే జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలుం టాయని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం తెలంగాణలోని బీసీ, ఎంబీసీలను కాంగ్రెస్ మరోసారి మోసం చేసిందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్‌లు తేల్చేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపట్టాలని, రాష్ట్రంలోని ఎంబీసీ, బీసీల జనాభా ఎంత వారి వెనుకబాటు తనానికి కారణాలేంటి అనే విషయాలను పరిశీలించడానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





# ఉప్పల్‌లో సన్‌రైజర్స్,పంజాబ్ క్రికెట్ మ్యాచ్ సందడి



**ఉప్పల్, మే 19 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన సన్‌రైజర్స్, పంజాబ్ జట్ల మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌తో సందడి వాతావరణం నెలకొంది. క్రికెట్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలుగుతుందని ఆదివారం ఉదయం ప్రేక్షకులు ఆందోళన చెందారు. అయితే మధ్యాహ్నాం వరకు ఉప్పల్‌లో వర్షం లేకపోవడంతో ప్రేక్షకులు ఊపిరి పీల్చుకున్నారు. మధ్యాహ్నాం 3 గంటలకు మ్యాచ్ ప్రారంభం కాగా ఎటువంటి అంతరాయం లేకుండా మ్యాచ్ పూర్తి చేశారు. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లతో 5 వికెట్ల నష్టానికి 214 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన హైదరాబాద్ జట్టు దాటిగా ప్రారంభించింది. మధ్యాహ్నాం ఒంటి గంటల నుంచే స్టేడియం వద్ద సందడి వాతావరణం నెలకొంది. పాసులు ఉన్న పలువురు ప్రేక్షకులకు రెండు గంటల ముందే స్టేడియంలోకి అనుమతించారు. స్టేడియంకు వెళ్లే అన్ని రహదారుల వద్ద తీవ్ర ట్రాఫిక్ రద్దీ నెలకొంది. ఒక వైపు వర్షం, మరో వైపు రహదారులపై వాహనాల కారణంగా ఉప్పల్ పరిసర ప్రాంతాల ప్రజలు అవస్థలు పడ్డారు. రోడ్ల వెంట కిలోమీటర్ల పరిధిలో వాహనాలు నిలిచిపోయాయి.







## 'మధు'రానగర్ మధుశాల ధ్వంసం

-భర్తను కొట్టినందుకు వైన్‌షాప్‌పై దాడి చేసిన మహిళ

హైదరాబాద్, మే19, ప్రభాతవార్త:

మద్యం కొనడానికొచ్చిన తన భర్తను కొట్టినందుకు ఒక మహిళ ఏకంగా వైన్‌షాపునే ద్వంసం చేసిన ఘటన మధురానగర్ ప్రాంతంలో చోటు చేసుకుంది. మద్యం కొనేందుకు వచ్చిన తన భర్తపై వైన్ షాప్ సిబ్బంది దాడి చేయడంతో అతడి తల పగిలి తీవ్ర గాయాల పాలయ్యాడు. దాంతో రక్తంతో భర్తను చూసిన భార్య కోపోద్రిక్తురాలై సదరు వైన్ షాప్‌పై దాడి చేసింది. తన స్నేహితులను వెంట తీసుకెళ్ళిన ఆమె వైన్ షాపులోకి చొరబడి సిబ్బందిని చితకబాదింది. అనంతరం బాటిల్స్ పగలగొట్టి ర్యాక్‌లను విరిచేసింది. క్యాష్ కౌంటర్ పగలగొట్టింది. దాంతో స్థానికులు సమాచారమివ్వగా అక్కడకు చేరుకున్న పోలీసులు ఆమెను అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారిపై కూడా విరుచుకు పడింది. తన భర్తను తల పగిలేటట్లు కొట్టిన వైన్ షాపు సిబ్బందిదే తప్పంటూ వాదనకు దిగిన ఆమె పోలీసులని కూడా చూడకుండా వారి జుట్లు పట్టుకుని కొట్టింది. దాంతో ఆమెనీ, ఆమె అనుచరులనూ, గొడవకి కారణమైన వైన్ షాప్ సిబ్బందినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ మేరకు వైన్ షాపు సిబ్బందిపై, దాడికి దిగిన మహిళపై వివిధ కేసులు నమోదు చేశారు.

## మరిన్ని మల్టీలెవల్ కార్ పార్కింగ్ బిల్డింగ్‌లను కట్టాలి : కెటిఆర్

హైదరాబాద్, మే 19 ప్రభాతవార్త




పూర్తిస్థాయిలో ఆటోమేటెడ్, కంప్యూటరైజ్డ్ మల్టీ లెవల్ కార్ పార్కింగ్ (ఎంఎల్‌సీపీ) పనులు దాదాపు పూర్తి కావడం పట్ల బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హర్షం వ్యక్తం చేశారు. పిపిపి విధానంలో నాంపల్లి మెట్రో స్టేషన్ సమీపంలో ఈ మల్టీలెవల్ కారు పార్కింగ్‌ను నిర్మించాలని 2016-17లో నిర్ణయిం చామని చెప్పారు. కానీ కొన్ని కారణాల వల్ల ఆలస్యమైన ఈ ప్రాజెక్టు ఎట్టకేలకు పూర్తికావచ్చిందని అన్నారు. ఇటువంటి మల్టీలెవల్ కార్ పార్కింగ్ విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరింత ముందుకు తీసుకెళ్లాలని కెటిఆర్ అన్నారు. ముఖ్యమైన జంక్షన్లు, మెట్రో స్టేషన్లు, కమర్షియల్ సెంటర్లకు సమీపంలో ఇలాంటివి మరిన్ని కట్టాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సైబర్ ఫ్రాడ్ చేయడానికి బ్యాంక్ అకౌంట్లు

-దేశ వ్యాప్తంగా 125 కేసుల్లో 82 బ్యాంకు ఖాతాల గుర్తింపు -ఐదుగురి అరెస్ట్

హైదరాబాద్, మే19, ప్రభాతవార్త:

సైబర్ నేరగాళ్ళకు బ్యాంక్ అకౌంట్లు తయారు చేసిన ముఠాని తూర్పు మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ఈజీ మనీ కోసం అత్యాశకు లోనై పలువురు మ్యూల్ బ్యాంక్ ఖాతాలు తెరిచి సైబర్ మోసగాళ్ళకు సరఫరా చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా 125 కేసుల్లో 82 బ్యాంకు ఖాతాలను పోలీసులు గుర్తించారు. ఈ ఖాతాల్లో సుమారు రూ.5 కోట్లు జమైనట్లు తెలిసింది. ఆ మొత్తాన్ని సైబర్ నేరగాళ్ళు విత్‌డ్రా చేసుకున్నారు.స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో బృందం సాయంతో హైదరాబాద్ పోలీసులు నేర పరిశోధన మొదలుపెట్టగా, తగిన ఆధారాలు లభించడంతో మ్యూల్ ఖాతాలు అందిస్తున్న నిందితులను అరెస్ట్ చేశారు. వారు ఉత్తరాఖాండ్‌కు చెందిన ఆరిఫ్ షఫీ(40), పాతబస్తీకి చెందిన మహమ్మద్ అబ్దుల్ నవీద్(30), సోహైల్‌ఖాన్ (20), మహమ్మద్ దాదే ఖాన్(21), చాంద్రాయణ గుట్టకు చెందిన సోహైల్ ఖాన్ (25)లుగా గుర్తించారు. వారి వద్దనుంచి 65 బ్యాంక్ ఖాతాల కిట్లు, 14 డెబిట్ కార్డులు, 31 సిమ్‌కార్డులు, ఆరు మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ప్రధాన నిందితుడైన ఆరిఫ్ షఫీ సౌదికి వెళ్ళిన అనంతరం క్రిప్టో కరెన్సీ వ్యాపారానికి సంబంధించిన మెళకువలు తెలుసుకున్నాడు. అందులో భాగంగా వివిధ ఆధారాలతో బ్యాంక్ అకౌంట్లతో పాటూ, సిమ్ కార్డులు తదితర సాంకేతిక ఆధారాలు సైబర్ నేరగాళ్ళకి అవసరమని గ్రహించాడు. ఈ చక్రంలోకి నగరానికి చెందిన తన స్నేహితులు మరికొందరిని లాగి సంపాదనా వివరాలు తెలియజేశాడు. బ్యాంకు ఖాతాలకు గానూ రూ.1500, సిమ్ కార్డులు ఇస్తే 10,000 ఇస్తున్నట్లు చెప్పాడు. దాంతో వీరంతా బేంక్ ఖాతాలు తెరిచి పాస్‌బుక్కు, డెబిట్ కార్డులతో పాటు సిమ్ కార్డులను విదేశాలకు పంపడం మొదలు పెట్టారు. దేశ వ్యాప్తంగా నమోదయిన కేసుల్లో గల బ్యాంకు ఖాతాల్లో సైబరాబాద్‌లో 3, హైదరాబాద్‌లో 3, రాచకొండలో ఒకటి, కరీమ్‌నగర్‌లో ఒకటి, జహీరాబాద్‌లో ఒకటి, ఇలా మొత్తం 9ఖాతాలను గుర్తించారు. ఈ మేరకు కేసు వీరిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.







# నగరంలో మళ్లీ వర్షం

-మరో మూడు రోజుల పాటు వర్షాలు

హైదరాబాద్, మే 19 ప్రభాతవార్త

నగరంలో పలు చోట్ల మళ్లీ వర్షం కురిసింది. ఇప్పటికే వచ్చే మూడు రోజులు వర్షాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిహెచ్ఎంసి అధికారులు కూడా సూచనలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది.ఆదివారం నైరుతి రుతుపవనాలు అండమాన్ చేరుకున్న క్రమంలోనే నగరంలో వర్షం కురిసింది. సికింద్రాబాద్ పరిధిలోని బేగంపేట, ప్యారడైజ్, చిలకలగూడ, అల్వాల్, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, జవహర్‌నగర్, సుచిత్ర, జీడీమెట్ల, కొంపల్లి,అమీర్‌పేట, ఎస్సార్‌నగర్, సనత్‌నగర్, పంజాగుట్ట, సోమాజిగూడ, ఎర్రగడ్డ, ఫతేనగర్, బాలానగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. కాగా, నగరంతో పాటు తెలంగాణలో రాగల మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

## సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రత్యేక ఫోటో ప్రదర్శన





సాలార్‌జంగ్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన అరుదైన చిత్రాలు

**చార్మినార్,మే 19 ప్రభాతవార్త :** సాలార్‌జంగ్ మ్యూజియంలో ఇంటర్నేషనల్ మ్యూజియం దినోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోటో ప్రదర్శన సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంది. జంట నగరాలలోని పలు ప్రాంతాలకు చెందిన పలువురు చిత్రకారులు రూపొందించిన అరుదైన చిత్రాలు ఫోటో ప్రదర్శనలో ఉన్నాయి.అల్విన్‌కాలనీకి చెందిన చిత్రకారులు కె.పురుషోత్తం చారి రూపొందించిన చార్మినార్ కట్టడం చిత్రం అద్బుతంగా ఉంది.అదే విధంగా ఎపిలోని అరకు ప్రాంతానికి చెందిన గిరిజనుల జీవన శైలికి సంబంధించిన చిత్రాలు,గ్రామీణ ప్రాంతం వాతావరణం ఫోటో,పాతకాలంలో పగిలి పోయిన కుండలను అతికిస్తున్న చిత్రం,లూనా మీద ఆరుగురు ప్రయాణం చేస్తున్న చిత్రంతో పాటు దాదాపు ఇరవై రెండు చిత్రాలు ఈ ప్రత్యేక ఫోటో ప్రదర్శనలో ఏర్పాటు చేశారు.సాలార్‌జంగ్ మ్యూజియంను సందర్శించటానికి వచ్చిన పర్యాటకులు అరుదైన చిత్రాలను తిలకించి ఎంతో అనుభూతికి లోనయ్యారు.





## గచ్చిబౌలిలో ఉత్సాహంగా వైటథాన్ రన్...

-పిల్లల్లో ఏర్పడే కంటి క్యాన్సర్ల మీద అవగాహన కల్పిస్తూ సాగిన పరుగు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాదాపూర్ డిసిపి వినీత్

గచ్చిబౌలి, మే 19 ప్రభాతవార్త

చిన్నారుల్లో ఏర్పడే రెటినోబ్లాస్టోమా కంటి క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తింపుపై అవగాహన కల్పించడంతో పాటు చికిత్సకు నిధులు సేకరించేందుకు ఏర్పాటు చేసిన వైటథాన్ రన్ గచ్చిబౌలిలో ఉత్సాహంగా సాగింది. ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రన్‌ను ఆదివారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మాదాపూర్ డిసిపి డాక్టర్ వినీత్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి సంవత్సరం మే నెల రెండవ ఆదివారం ప్రారంభించి, ఏడు రోజుల పాటు నిర్వహించే రెటినోబ్లాస్టోమా అవగాహనా వారాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వైటథాన్ పరుగుతో సేకరించిన నిధులను రెటినోబ్లాస్టోమాతో బాధపడుతున్న పేద పిల్లల చికిత్స కోసం ఉపయోగించడంతో పాటు పరిశోధనకు ఉపయోగించనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ సంవత్సరం వైటథాన్ రన్‌లో దాదాపు 2వేల మంది ఔత్సాహికులు పాల్గొన్నారని తెలిపారు. మూడేళ్ల లోపు వయస్సు ఉన్న పిల్లలకు ఏర్పడే రెటినోబ్లాస్టోమా అరుదైన కంటి క్యాన్సర్ అని, చికిత్సలో అనేక నెలల పర్యవేక్షణ, ఖరీదైన ప్రక్రియలు, శస్త్రచికిత్సలు ఉంటాయన్నారు. గత దశాబ్ద కాలంగా ఎల్‌వి ప్రసాద్ సంస్థ 2500కు పైగా చిన్నారులకు చికిత్స అందించిదని, అందులో 65శాతం ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం 150నుంచి 200 కొత్త రెటినోబ్లాస్టోమా చికిత్సలను ఎల్‌వి ప్రసాద్ సంస్థ చేపడుతుందని, అందులో 40శాతం తీవ్ర దశలో, 10 శాతం చివరి దశలో వస్తున్నారన్నారు. ఈ సందర్భంగా రన్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌వి ప్రసాద్ సంస్థ ఎక్జిక్యూటీవ్ చైర్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్, డాక్టర్ స్వాతి కల్కి, ఎన్ఎండిసి డైరెక్టర్ దిలిప్‌కుమార్ మహంతి, డాక్టర్ విజయ్ ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోచమ్మతల్లి ఆలయంలో బోనం ఎత్తిన ఎమ్మెల్యే రోహిత్‌రావు

## తెలంగాణ సంస్కృతికి ప్రతిరూపాలు బోనాలు

**చిన్నశంకరంపేట, మే 19,ప్రభాతవార్త:** బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. ఆదివారం మిర్జాపల్లి గ్రామంలోని పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పోచమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సదర్భంగా బోనం ఎత్తుకొని అమ్మవారికి బోనం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆ పోచమ్మ తల్లిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణ, మాజీ ఎంపీపీ బోయిని అరుణ, జనార్ధన్, మనోజ్, నాయకులు ప్రభాకర్ ఉన్నారు.

## హిందూ ధర్మాన్ని పరిరక్షించుకుందాం



సమావేశమైన రామాలయ కమిటీ బాధ్యులు

**చౌటకూరు, మే 19, ప్రభాతవార్త:** హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి హిందువుపై ఉందని, అందుకు ప్రతి ఆదివార మండలంలోని ఓ గ్రామంలోని ఆలయంలో హనుమాన్ చాలీసా, రామ నాయ జపం చేయాలని కొర్పోల్ రామాలయ కమిటి బాధ్యులు తీర్మానించారు. ఆదివారం మండలంలోని కొర్పోల్ గ్రామంలోని శ్రీరామ మందిరంలో గ్రామ శ్రీరామ కమిటి బాధ్యులు సమావేశం అయ్యారు ఆలయంలో కమిటి బాధ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి హనుమాన్ చాలీసా, శ్రీరామ పారయణం చేశారు. ఆలయ ఆవరణలో సభ్యులు సమావేశమై ప్రతి ఆదివారం మండలంలోని ప్రతి గ్రామంలో హనుమాన్ చాలీసా, శ్రీరామ పారాయణం చేయాలన్నారు. అందుకు ప్రతి గ్రామంలో హిందుసోదరులు పలుపంచుకునేలా చర్యలు తీసుకుందామన్నారు. వచ్చే ఆదివారం మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు హనుమాన్ చాలీసా, శ్రీరామ పారాయణం చేయాలని, హైందవ ధర్మ పరిరక్షణకు ప్రతి హిందువు ముందుకు రావాలని కమిటి బాధ్యులు సూచించారు.

## శ్రీరామనారాయణ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



రామనారాయణ క్షేత్రంలో పూజలు చేస్తున్న హనుమాన్ దీక్షా స్వాములు

**నర్సాపూర్ మే 19, ప్రభాతవార్త :** మండల పరిధిలోని లింగాపూర్ గ్రామ శివారులోని లాలు తండాలో తెలిసిన శ్రీ రామనారాయణ క్షేత్రంలో ఆదివారం హనుమాన్ దీక్షా స్వాముల అధ్వర్యంలో శ్రీరామచంద్రస్వామికి ప్రత్యేక పూజలుచేయడం జరిగింది. ఆలయంలోని శ్రీ రామచంద్రస్వామికి ఆలయ ధర్యకర్త పాత్‌లోత్ రాంచందర్ అధ్వర్యంలో ఆలయ పూజారి అరుణ్ పంతులు వేద మంత్రాల మధ్యన అబిషేకం తో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్బంగా హరుమాన్ దీక్షా స్వాములు నియమ నిష్టలతో, భక్తి శ్రద్ధలతో ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వారు హనుమాన్ చాలీసా పారాయణం చేయడం జరిగింది. ఆలయ ధర్యకర్త పాత్‌లోత్ రాంచందర్ అధ్వర్యంలో లింగాపూర్‌లోని శ్రీరామ నారాయణ క్షేత్రంలో శ్రీరామచంద్రస్వామికి పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు.

## నర్సరీల్లోని మొక్కలను రక్షించాలి : ఎంపిపి



గవ్వలపల్లిలోని నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మిరెడ్డి

**చిన్నశంకరంపేట, మే 19, ప్రభాతవార్త:** నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా చూసుకోవాలని మండల ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మిరెడ్డి అన్నారు. ఆదివారం నాడు మండల పరిధి గవ్వలపల్లి నర్సరీలోని మొక్కలను ఆమె పరిశీలించారు. నర్సరీల్లో మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛమైన ఆక్సిజన్ కావాలంటే ప్రతి ఒక్కరు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని ఆమె సూచించారు. గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతకు అధిక ప్రాదాన్యత ఇవ్వాలని ఆమె తెలిపారు. ఈ సందర్బంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, శేఖర్‌లు ఉన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, మే 19 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ఇప్పలగూడెం గ్రామానికి చెందిన కత్తెరపాక లక్ష్మి ఇటీవల వడదెబ్బతో అనారోగ్యానికి గురై మరణించింది. విషయం తెలుసుకున్న వంటిమామిడి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బబ్బూరి రాందాస్‌గౌడ్ ఆదివారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయనతో పాటు వైస్ ఎంపిపి మంద బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అశోక్ ఉన్నారు.

## నేలకొరిగిన విద్యుత్ స్తంభం

**చిన్నశంకరంపేట, మే 19, ప్రభాతవార్త:** మండల వ్యాప్తంగా శనివారం రాత్రి వీచిన ఈదురు గాలులతో చందాపూర్‌లోని పొలాల వద్ద విద్యుత్తు స్తంభం నేల కొరిగింది. అంబాజీపేట, శాలీపేట, గజగట్లపల్లి, రుద్రారం, జంగరాయి గ్రామాలలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం తడిసిపోయాయి.



ఈదురు గాలులతో చందాపూర్‌లో నేల వాలిన విద్యుత్తు స్తంభం

# దుర్గమ్మ సన్నిధిలో భక్తుల సందడి



భక్తుల పూజలు అందుకుంటున్న వనదుర్గా భవాని మాత, అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

**పాపన్నపేట, మే 19, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఏడుపాయల వనదుర్గా మాత ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి చేరుకున్న భక్తులు అమ్మల గన్నా అమ్మ మాయమ్మ దుర్గమ్మ అంటూ భక్తులు అమ్మవారిని కొలుస్తూ మొక్కుబడిలో భాగంగా అమ్మవారికి తలనీలాలు సమర్పించి మంజీర పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి బోనాలు, ఒడిబియ్యం సమర్పించి కుంకుమార్చన పూజాకార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారు జామున పురోహితులు వేద మంత్రాలు వల్లిస్తూ అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు, రంగురంగు పూలతో అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ అర్చకులు శంకర శర్మ, పార్థివ శర్మ, నాగరాజు శర్మ, మురళి శర్మ, రాజశేఖర్‌శర్మ వేద మంత్రాలు వల్లిస్తుండగా అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయ కమిటి చైర్మన్ సాతెల్లి బాలగౌడ్, ఆలయ ఈఓ మోహన్‌రెడ్డిలు తమ సిబ్బందితో తగు ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాల్లో ఎస్‌ఐ నరేష్ తన సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్

## ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయం

### -మాజీ మంత్రి చంద్రశేఖర్

**జహీరాబాద్, మే 19, ప్రభాతవార్త:** పట్టణంలోని మెథడిస్ట్ సెంట్రల్ చర్చిలో 94వ క్రైస్తవ ఉజ్జీవ జాతర మహోత్సవాలు ఘనంగా ముగిసాయి. మాజీ మంత్రి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్ చర్చి ప్రాంగణంలో చర్చి వ్యవస్థాపకులు రెవరెండ్ జీబి గార్డెన్ సతిమణి ఎల్సి గార్డెన్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు విశ్వ మానవాళికి బోధించిన జ్ఞానము, సూక్తులు అనుసరించదగినవన్నారు. కార్యక్రమంలో డిఎస్ జాన్ వెస్లీ, నిర్వహకులు నరేన్ జాన్, అనంత నవీన్ కుమార్, చర్చి పాస్టర్లు, కమిటి బాధ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**ప్రత్యేక ప్రార్ధనలు చేసిన నరోత్తం...**

క్రైస్తవ జాతరను పురస్కరించుకుని ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ వై నరోత్తం చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. జిల్లా అధికారి జాన్ వెస్లీ, లేలీడర్ సనిన్ జాన్, రవికుమార్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని పురస్కరించుకుని శేఖ్ మక్బుల్ దైవ సందేశం చేశారు. కార్యక్రమంలో కాన్ఫరెన్స్ లేలీడర్ ఇమానియల్, ఆర్‌ఓబి సభ్యులు మేరీ, డి మాణిక్ ప్రభు గౌడ్, ఆయా పార్టీల నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

## బిబి పాటిల్‌కు శ్రీశైలం ప్రసాదం



బిబి పాటిల్‌కు శ్రీశైలం ప్రసాదాన్ని అందచేస్తున్న బిజెపి నాయకులు అరుణ్‌రాజ్ దృశ్యం

**సిర్గాపూర్, మే 19, ప్రభాతవార్త:** జహీరాబాద్ ఎంపి బిబి పాటిల్‌కు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలంలో కొలువున్న భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ప్రసాదాన్ని భారతీయ జనతా పార్టీ నాయకులు అరుణ్‌రాజ్ శేరికార్ ఆదివారం అందచేశారు. బిబి పాటిల్‌ను శాలువాతో సన్మానించి ప్రసాదాన్ని అందించి ముందుస్తు శుభాకాంక్షలు తెలియచేశారు.

## పేద విద్యార్థులకు మానవతావాదులు సహకరించాలి

### ఎంపిటిసిల రాష్ట్ర నాయకుడు దేవి రవీందర్

**కొండపాక, మే 19, ప్రభాతవార్త :** చదువుకు పెదరికం అడ్డురాకుండా మానవతవాదులు నిరుపేద విద్యార్థి రామిండ్ల స్వామికి సహకరించాలని వైస్ ఎంపిపి, ఎంపిటీసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ విజ్ఞప్తి చేశారు. కుకునూరుపల్లి మండల పరిధిలోని రాయవరం గ్రామానికి చెందిన స్వామి తల్లి గతంలో మృతి చెందగా, నాలుగు రోజుల క్రితం త ండ్రి సైతం మృతి చెందాడు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న అయన స్వామిని పరామర్శించి రూ॥ 5 వేలు వ్యక్తిగత సహాయంగా అందించారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారిన స్వామి చదువుల కోసం మానవతవాదులు అండగా ఉండాలని కోరారు.

ఇంటర్ మొదటి సంవత ్సరం పూర్తి చేసిన అయనకు పై చదువుల కోసం అవసరం ఉంటే తనవంతుగా సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులు కుక్కల కల్పనా కనకరాజు, అమ్ముల రమేష్, మల్లమారి రవీందర్, మాజీ ఎంపిటీసీ నరి ్సంలు, గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీశైలం, కొండ స్వామి, దొమ్మాట చంద్రశేఖర్, గంపల రాజు, కుక్కల నవీన్, అయిలయ్య, కనకయ్య, పాల్గొన్నారు.



శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఉత్సవాల్లో హోమాల్లో పాల్గొన్న భక్తులు

## శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో హోమాలు

**నారాయణఖేడ్ టౌన్, మే 19, ప్రభాతవార్త:** మండల పరిధిలోని లింగాపూర్‌లో శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిత్య హోమం జరుపుకున్నారు. ఆలయంలో నిర్వహించిన హోమాల్లో తాజా మాజీ సర్పంచ్ కాసులబాధ సతీష్, కాసులబాధ రాధాకృష్ణ, కోట శ్యామ్, తైదపల్లి ఈశ్వరప్ప, కటకం హన్మండ్లు, మార్తాటి మాణిక్యం, కమ్మరి నరసింహులు, గడిల భూపతి, నామ దత్తు, గొల్ల నరసింహులు మాల్కయి, విఠల్, తుమ్మలి బాలయ్య, గంజాయి పరమేశ్వర్ పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకుంటున్న దృశ్యం

**పాపన్నపేట, మే 19, ప్రభాతవార్త:** పూర్వజ్ఞాపకాలు, భవిష్యత్ బంధాలుగా కొనసాగుతాయని రిటైర్డ్‌ప్రధానోపాధ్యాయులు ఆకుల బాలయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పాపన్నపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 2004–05 విద్యాసంవత్సరంలో ఎస్ఎస్‌సి పూర్తి చేసిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళ కార్యక్రమం జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అప్పటి ప్రధానోపాధ్యాయులు ఆకుల బాలయ్య మాట్లాడుతూ మానవీయ విలువలు అంతరించి పోతున్న తరుణంలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకోవడం నాడు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను ఆహ్వానించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి ఆత్మీయ సమ్మేళనాన్ని ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్బంగా విద్యార్థులు నాటి జ్ఞాపకాలను, కొనగాతున్న పనులపై ఎవరికి వారు వివరించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు రిటైర్డ్ ఎంఈఓ మోహన్‌రాజు జ్ఞానోట, మాధవరెడ్డి, పద్మశ్రీ, రాజశేఖర్, చంద్రహాస్, పూర్వ విద్యార్థులు సురేందర్ సింగ్, విక్రం రాజు, శ్రీరాం దర్గేష్, వెంకట్ తులసి, సుప్రియ, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలను కాపాడుకుంటాం :

### ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

**మర్కుక్, మే 19 (ప్రభాతవార్త):** క్షేత్ర స్థాయిలో కార్యకర్తల కృషితోనే పార్టీ బలోపేతం అవుతుందని, అలాంటి కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గంగాపూర్ గ్రామానికి చెందిన జుగ్రాజ్ విశాల్ బిఆర్ఎస్ పార్టీలో కార్యకర్తగా పనిచేసి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మృతునికి పార్టీ సభ్యత్వం ఉన్నందున రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును ఆదివారం మృతుని కుటుంబానికి ప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డిలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. మృతుడు విశాల్ పార్టీలో క్రియాశీల కార్యకర్తగా ఎంతో సేవ చేశారని గుర్తు చేస్తూ అతని మృతి బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాందాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ గడ్డం ప్రసాద్, బిఆర్ఎస్ బిసిసెల్ మండల అధ్యక్షుడు మేకల కనకయ్య, సంతోష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర్, మర్కుక్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరం

**నర్సాపూర్, మే 19, ప్రభాతవార్త :**

నర్సాపూర్ సమీపంలోని బివిఆర్ఐటి కళాశాలలో రెండు రోజుల ఉచిత కంప్యూటర్, శిక్షణా శిబిరం, కృత్రిమ మేధస్సు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం బివిఆర్ఐటి కళాశాల యజమాన్యం సహకారంతో ఐటి డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల యజమాన్యం సహకారంతో ఐటి డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ ఉచిత కంప్యూటర్ శిక్షణా శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్‌దూబే తెలిపారు. మొదటి రోజు కంప్యూటర్ సమాచారం, దాని భాగాలు, ఉపయోగాలు, ఇంటర్‌నెట్, ఈ–మెయిల్ రైటింగ్ పై అవగాహన కల్పించడం జరిగింది,రెండవ రోజు మైక్రోసాఫ్ట్, ఆఫీస్,ఎక్సల్, వర్డ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, డిజిటల్ ఎడ్యుకేషన్, ఏ వన్ టూల్స్ గురించి ప్రాక్టికల్‌గా చేయించడం జరిగిందన్నారు. ఉచిత కంప్యూటరనశిక్షణా శిబిరం ముగింపు సమావేశాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఎస్‌విఈఎస్ సొసైటీ డైరెక్టర్ డా. రవీంద్ర బాబు, బివిఆర్ఐటి కళాశాల డైరెక్టర్ డా: లక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ ఈ శిక్షణలో నేర్చుకున్న జ్ఞానంతో జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఐటి విభాగ అధిపతి దశరథ రామయ్య మాట్లాడుతూ నర్సాపూర్ ప్రాంతంలోఉన్న యువతీ యువకులకు సాంకేతక పరిజ్ఞానం పై అవగాహన కల్పించాన్న ఉద్దేశంతో ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. శిబిరం కోఆర్డినేటర్ అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణకు వయస్సుతో నిమిత్తం లేకుండా 180 మంది హాజరయ్యారని అన్నారు. శిక్షణకు వచ్చిన అభ్యర్థులకు కళాశాల యజమాన్యం ఉచిత భోజన వసతి, రవాణా సౌకర్యం, పుస్తకాలు, పెన్నులు అందించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల మేనేజర్ బాపిరాజు, ఏవో అశోక్‌రెడ్డి,ఆర్గనైజర్ తుకారాంరెడ్డి, శ్రీనివాస్, ఐటి డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల బృందం పాల్గొన్నారు. అనంతరం అభ్యర్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.




అభ్యర్థులకు సర్టిఫికెట్‌లను అందిస్తున్న కళాశాల యజమాన్యం ప్రతినిధులు




శివంపేట్‌లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని జరుపుకుంటున్న దృశ్యం

## ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

**చౌటకూరు, మే 19, ప్రభాతవార్త:** మండల పరిధిలోని శివంపేట్‌లో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఎబి ఇన్‌బేవ్ ఇండియా కర్మాగారంలో ఘనంగా జరుపుకున్నారు. పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాగారెడ్డి వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై సుందరయ్య చేసిన సేవలను కొనియాడారు. వెట్టి చాకిరి విముక్తి కొరకు తెలంగాణ సాయుధ పోరాటానికి సుందరయ్య నాయకత్వం వహించి కామ్రేడ్ పిఎస్‌గా నడిపించిన పోరాటయోదుడని గుర్తు చేసుకున్నారు. సుందరయ్య ఆశయాలను ఆచరణలో పెడుతూ ముందుకు తీసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పర్మనెంట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రసన్నరావు, కాంట్రాక్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి కే సురేష్, ఆఫీస్ బేరర్స్, కార్మికులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నేటి యువతకు ఆదర్శం

### సిపిఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు

**నర్సాపూర్ మే 19, ప్రభాతవార్త :** నేటి యువత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకోని ప్రజా జీవితాలకు అంకితమవ్వాలని సిపిఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు అన్నారు.ఆదివారం నర్సాపూర్ పట్టణంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39 వ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు మాట్లాడుతూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య దక్షణ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఉద్యమ నిర్మాతగా, సిపిఎం పార్టీ అఖిల భారత కార్యదర్శిగా తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించి 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచడంతో కీలక పాత్ర పోషించాడని అన్నారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడిగా ఉండి దేశంలోని అనేక ప్రజా సమస్యలను లేవనెత్తి పరిష్కార మార్గం చూపిన గొప్పవ్యక్తి అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలోనాగబూషణం, నాయకులు పోచయ్య, సామ్యానాయక్, రమేశ్‌రెడ్డి, మహేశ్,శంకర్ మల్లేషం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేస్తాం

### బిజెపి నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్

**రామాయంపేట, మే 19, ప్రభాతవార్త :** గ్రామస్థుల అందరి సహకారంతో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, చత్రపతి శివాజీ విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తామని బిజెపి రాష్ట్ర నాయకులు, నిజాంపేట జడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ అన్నారు. శనివారం రామాయంపేట మండలం ఆర్.వెంకటాపూర్ గ్రామంలో పంజా విజయ్‌కుమార్ పర్యటించారు. ఇటీవల గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన పరిశీలించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఐదుగురు యువకులను అంబేద్కర్ విగ్రహం ధ్వంసం కేసులో అరెస్టు చేయడంతో వారి కుటుంబాలను పంజా విజయ్ కుమార్ పరామర్శించారు. ఈ సందర్బంగా బాధిత కుటుంబాల వారు మాట్లాడుతూ తమ కుమారులు ఎలాంటి ఘాతుకానికి పాల్పడలేదని, అన్యాయంగా పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారని వారు ఆరోపించారు. తాముపేద కుటుంబాలకు చెందిన వారమని రాజకీయంగా కొందరు వ్యక్తులు కావాలనే తమ పిల్లలను అరెస్టు చేయించారని జడ్పీటీసీ దృష్టికి బాధితులు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పంజా విజయ్‌కుమార్ మాట్లాడుతూ మీరు అధైర్య పడవద్దని, పిల్లలను జైలు నుండి తీసుకువచ్చే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. మహనీయులను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సందర్బంగా ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దయానంద్‌రెడ్డి, జిల్లా నాయకులు నవాత్ రాజేంద్రప్రసాద్, జంగంపల్లి శంకర్‌గౌడ్, సిద్దరాంరెడ్డి, పంజ బాబు, ప్రధాన కార్యదర్శి నవీన్ గౌడ్, భరత్‌కుమార్, లక్ష్మణ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి

### సిఐటియు కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

**రామాయంపేట, మే 19, ప్రభాతవార్త :** కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పించడంలో ఎంఎస్ఎన్ కంపెనీ పూర్తిగా విఫలమైందని కామారెడ్డి సిఐటియు అధ్యక్షులు చంద్రశేఖర్ అన్నారు. కొన్ని రోజుల క్రితం కామారెడ్డి జిల్లా పెద్దమల్లారెడ్డి ఎంఎస్ఎన్ కంపెనీలో గాయపడ్డ, మండల పరిధిలోని ఝాన్సీలింగాపూర్ వాసి సంజీవరెడ్డిని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పించడంలో కంపెనీ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందువల్లే తరచుగా కార్మికులు గాయాల పాలవుతున్నారన్నారు. గాయపడ్డ కార్మికునికి చికిత్స అందించడంలో కంపెనీ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని ఆయన ఆరోపించారు. గాయపడిన కార్మికునికి పూర్తిగా నయం అయ్యేవరకు చికిత్స అందించాలని ఆయన డిమాండ్ చేశారు. గాయపడ్డ కార్మికుల కుటుంబాన్ని కంపెనీలు ఆదుకోవాలన్నారు. గాయపడ్డ కార్మికుడు చికిత్స పొందుతున్న సమయంలో పూర్తి వేతనం చెల్లించాలన్నారు. గాయపడ్డ కార్మికుడు కోలుకున్నాక తిరిగి, తనకు తగిన పని కల్పించాలన్నారు. కంపెనీలో పనిచేసే మిగతా 600 మంది కార్మికులకు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26000 అందజేయాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ ప్రతి కార్మికునికి తప్పనిసరిగా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి ఉన్నారు.

## నేడు శ్రీసరస్వతి విద్యార్థుల ప్రదర్శన

**నారాయణఖేడ్ టౌన్, మే 19, ప్రభాతవార్త:** సంస్కార్ సాధనవర్గ వేసవి శిక్షణా శిబిరంలో నేర్చుకున్న ఆయా అంశాలను శ్రీ సరస్వతి విద్యార్థులు సోమవారం సాయంత్రం పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిరంలో ప్రదర్శించనున్నట్లు పాఠశాల ప్రబంధకారిణి కమిటి బాధ్యులు, పాఠశాల ఆచార్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి పోషకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు ఆహ్వానించారు.

## పాఠశాల మరమ్మతు పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

**నర్సాపూర్ మే, 19. ప్రభాతవార్త :** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు జగన్నాథరావు కాలనీలోని రోషిణి ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను, అలాగే గాంధీ విగ్రహం వద్ద గల డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ పరిశీలించారు. గాంధీ విగ్రహం వద్ద గల ఓపెన్ డ్రైనేజీతో ప్రజలకు నానా ఇబ్బందులు కలిగేవి ఈ ఇబ్బందులను గమనించిన మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ స్వయంగా ఉండి ఓపెన్ డ్రైనేజీ పనులను చేయించి పూర్తి చేశారు. దీంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని అన్నారు.. అంతేగాక 1వ వార్డు జగన్నాథరావు కాలనీలోని రోషిణి ప్రభుత్వ పాఠశాలలో వాటర్ ట్యాంక్, మరుగుదొడ్లు, వాటర్ సంప్, పాఠశాల మరమ్మతు పనులు జరుగుతున్నందున వాటిని పరిశీలించారు. త్వరగా పాఠశాల మరమ్మతు పనులు పూర్తిచేయాలని మున్సిఫల్ చచైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నాగభూషణం, ఫైజాన్, అర్బాస్, సిబ్బంది పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తదితరులు